ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
ఆదివారం 31 మార్చి 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (ఆది)
సహరి : 4:37 (సోమ)

ప్రత్యేక కేటగిరి ఓటర్లకు ఏర్పాట్లు

భీమవరం, మార్చి 30 : పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కేటగిరీకి చెందిన దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జండర్ ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'జిల్లాలోని 1,463 పోలింగ్ కేంద్రాల వద్ద టాయిలెట్లు, తాగు నీరు, షామియానాలు, పార్కింగ్ ప్లేస్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చాం. మంచానికి పరిమితమైన, 85 ఏళ్ల దాటిన వారి డేటాను, పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని విభిన్న ప్రతిభావంతులైన ఓటర్ల డేటాను త్వరితగతిన సేకరిస్తున్నాం' అని తెలిపారు.

పోలింగ్ శాతం పెరగాలి

సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాల్లో శాంతి యుతంగా ఎక్కువ శాతం పోలింగు నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని జేసీ, ఉండి ఆర్వో సి.వి. ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేటులో ఉండి నియోజకవర్గ ఏఆర్‌వోలు, సెక్టార్ అధికారులు, ఉప తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లతో ప్రీ-పోలింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు.

అమ్మో.. ఆ నేతను భరించలేం

- వెళితే చేతి చమురు వదలడం ఖాయం
- తీసుకున్నవే ఇవ్వలేదు.. మళ్లీ డబ్బులు కావాలట
- ముఖం చాటేస్తున్న ముఖ్య నాయకులు..
- ఎన్నికల వేళ అధికార పార్టీకి ఒక్కొక్కరు దూరం

జిల్లాలో అది పారిశ్రామిక కేంద్రం. అక్కడ వైసీపీ అభ్యర్థికి సొంత పార్టీ నాయకులు చుక్కలు చూపిస్తున్నారు. ఎన్నికల్లో పనిచేయలేమని తెగేసి చెబుతున్నారు. పార్టీలో ప్రచారం చేస్తే ఎదురు పెట్టుబడి తప్పదనే ఉద్దేశంతో చాలా మంది ముఖం చాటేస్తున్నారు. మరికొందరు ఆ నేతకు బైబై చెబుతున్నారు.



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించిన సదరు నేతకు కుడి భుజంగా వున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ఇటీవల పార్టీకి రాజీనామా చేశారు. నియోజకవర్గంలో పార్టీ ఆర్థిక వ్యవహారాలను చూసిన ఆయనకు అభ్యర్థి నుంచి ఊహించని షాక్ తగిలింది. ఒక సెటిల్‌మెంట్‌లో సమకూరిన రూ.4 కోట్లు తెచ్చి తనకు ఇవ్వాలంటూ హుకుం జారీచేశారు. అప్పటికే కొంత మొత్తం పార్టీ కార్యక్రమాలకు ఖర్చయ్యింది. ఇదే విషయంపై లెక్కలు చెబితే అధికార పార్టీ అభ్యర్థికి రుచించలేదు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య చెడింది. పార్టీలో అన్నీ తానై వ్యవహరించిన పారిశ్రామిక వేత్త, వైసీపీ నాయకుడు ఆ పార్టీకి రాజీనామా చేసి ఇటీవల బీజేపీలో చేరారు. రూరల్ మండలానికి చెందిన ఓ ప్రముఖ బిల్డర్ పార్టీకి దూరమయ్యారు. సదరు బిల్డర్ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా భీమవరంలో వ్యాపారాలు నిర్వహించేవారు. వైసీపీ నేతల నుంచి ఆయనకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. వ్యాపారాల్లో నష్టం చవిచూశారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబుతో ఏకాంతంగా భేటీ అయ్యారు. పారిశ్రామిక పట్టణానికి చెందిన నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానంటూ చెప్పుకొచ్చారు. పట్టణంలోనూ అన్నీ తానై వ్యవహరిస్తూ వచ్చిన మరో నాయకునికి అధికార పార్టీ అభ్యర్థి నుంచి పెద్ద మొత్తంలో సొమ్ములు రావాలి. బకాయి తీర్చడం లేదు. పైగా అభ్యర్థి అవినీతి దందా అధికమైంది. దీంతో పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు దూరంగా ఉంటున్నారు. జగన్ సొంత సామాజిక వర్గానికి చెందిన నాయకుడే పార్టీకి దూరమయ్యా రంటే ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థమవుతోంది. ఇప్పటికీ అభ్యర్థి నుంచి పార్టీ నాయకులు, సానుభూతిపరులకు దాదాపు రూ.8 కోట్లు రావాల్సి ఉందం టూ నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. ఆ సొమ్ములు తిరిగి ఇవ్వకపోవడంతో ఇప్పుడంతా పార్టీకి దూరమయ్యారు. ఒకరిద్దరి నాయకులతోనే అభ్యర్థి ఇప్పుడు ప్రచారం చేస్తు న్నారు. గత ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలకంగా వ్యవహరిం చిన కీలక నాయకులంతా ఇప్పుడు కినుక వహిస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కూటమికి చేయూతనిస్తున్నారు. అధికార పార్టీకి ఓటమి తప్పదన్న భావనతో మరి కొందరు బయటకు రావడం లేదు. ఈసారి అధికార పార్టీ నెగ్గితే పట్టణంలో నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బ తింటుందన్న ఆందోళన ఉంది. ఇది అధికార పార్టీ అభ్యర్థికి చుక్కలు చూపిస్తోంది. భవన నిర్మాణాల్లో కమీషన్‌లు తీసుకోవడం వంటి అవినీతి దందా తాజాగా అభ్యర్థిని వెంటాడుతోంది.

వైసీపీలో అసంతృప్తుల జ్వాల

- పార్టీ శ్రేణులు దూరం..
- తాడేపల్లిగూడెం శిబిరం వెలవెల



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైసీపీ ఎదురీదుతోంది. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడ్డ కీలక నాయకులంతా ఇప్పుడు దూరమయ్యారు. వైసీపీ శిబిరం వెలవెలబోతోందంటూ ఆ పార్టీ శ్రేణులే ఆందోళనతో ఉన్నారు. అధికార పార్టీ నేతకు దగ్గర బంధువు గడచిన ఎన్నికల్లో ప్రణా ళికలు రచించారు. ఆయన ఉన్నంత వరకు నియోజకవర్గంలో పార్టీ మంచి ఊపు మీద ఉండేది. పార్టీలో ప్రత్యామ్నాయంగా ఎదిగిపోతారన్న ఉద్దేశంతో అధికార పార్టీ నేత దగ్గర బంధువునే దూరం పెట్టారు. నియోజకవర్గంలో పార్టీ కోసం తొలి నుంచి చెమటోడ్చిన కార్యకర్తలకు అధికారంలోకి వచ్చిన తర్వాత మన్నన్న లేకుండా పోయింది. నియోజకవర్గ నేత తన సొంత మనుషులకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. పెంటపాడు మండల పరిషత్ బీసీ జనరల్‌కు కేటాయిస్తే అక్కడ తప్పటడుగు వేశారు. పెంటపాడు మండలంలో కీలకంగా ఉన్న నాయకుడు మండల పరిషత్ అధ్యక్ష స్థానంలో ఉండాలని ఆశించారు. ఆయనకు కాదని మరో మహిళకు పదవి కట్ట బెట్టారు. ఈ వ్యవహారం అప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీకి వెంటాడుతూనే ఉంది. పెంటపాడు మండలంలో పార్టీ బలహీనతకు అప్పటినుంచి పునాది పడింది. ఇప్పుడు పీక ల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. పెంటపాడు గ్రామంలోనూ, తాళ్ల ముదునూరుపాడులో ఒక బలమైన సామాజిక వర్గం ఎప్పుడూ జగన్‌మోహన్ రెడ్డికి అట్టిపెట్టుకుని ఉండేది. ఇక్కడ అధికార పార్టీ నేత వైఖరితో వారంతా దూరమయ్యారు. అందులో ఒక్కరికి మాత్రమే ఆర్థికంగా లబ్ధి చేకూరింది. రియల్ ఎస్టేట్ వెంచర్‌లో సహకారమందించారు. అందులోనూ ఆర్థిక ప్రయోజనాలు ఇమిడి ఉండడంతో సహకారమందించినట్టు విమర్శలు ఉన్నాయి. అదే సామాజిక వర్గంలో పార్టీ శ్రేణులకు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. మరోవైపు నష్టాలను చవిచూశారు. వైసీపీకి బలమైన ప్రాంతంగా వున్న అక్కడే ఇప్పుడు ఎదురీదవలసి వస్తోంది.

మున్సిపాలిటీ సొంత మనుషులకే

అధికార పార్టీ నేతకు గడచిన 20 ఏళ్ల నుంచి నమ్మిన బంటుగా వున్న ఎస్సీ సామాజిక వర్గ నాయకుడు మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేసుకునేవారు. టీడీపీ హయాంలో అతనిపై వేటు పడింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అదే అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించారు. కానీ జీతం ఇవ్వలేదు. చివరకు మహిళా సమాఖ్యలో కీలక పదవితోపాటు, మున్సిపాలిటీలో కాంట్రాక్టర్లు, ఇతర ఆర్థిక ప్రయోజనాల విషయంలో పట్టణంలో ఒకే కుటుంబానికి ప్రాధాన్యం లభించింది. తొలి నుంచి అధికార పార్టీ నేతకు అంటిపెట్టుకున్న ఉన్న ఎస్సీ సామాజిక వర్గ నాయకునికి వేటుపడింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగం నుంచిమళ్లీ తొలగించారు. వేతనం ఇవ్వలేదు. మరోవైపు పట్టణంలో ఒకే కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పార్టీ శ్రేణులు దూరమయ్యాయి. ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ సమావేశానికి అంతంతమాత్రంగానే పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. జగన్‌తోనూ, రాష్ట్రంలో ద్వితీయ శ్రేణీ నాయకత్వంతోనూ మంచి సంబంధాలు ఉన్న నాయకులు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అధికార పార్టీ నేతపై అసంతృప్తి రగిలిపోతున్నారు.

పార్టీ కేడర్‌కు ప్రయోజనం శూన్యం

నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరలేదు. అధికార పార్టీలో ఉన్నామన్న మర్యాద కూడా పొందలేదు. ప్రయోజనాలన్నీ అధికార పార్టీ నేతకే సమకూరాయి. పార్టీ శ్రేణులు అప్పుల్లో కూరుకుపోయాయి. గడచిన ఐదేళ్లలో పార్టీ కార్యకర్తల బాగోగులను చూసే పరిస్థితి లేకుండా పోయింది. గ్రామాల్లో చెప్పుకోవడానికి అభివృద్ధి లేదు. ఇవన్నీ ఇప్పుడు అధికార పార్టీని వెంటాడుతున్నాయి. కేవలం డబ్బుతోనే ఎన్నికలను ఎదుర్కోవలన్న తలంపుతో ఉన్నారు. పార్టీ అధిష్టానం వద్ద కూడా అటువంటి హామీ ఇచ్చే ఎన్నికల్లో తలపడేందుకు తాడేపల్లిగూడెం నాయకత్వం సిద్ధపడుతోంది. నియోజకవర్గ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేస్తూ వచ్చినా ఫలితం లేకపోయింది. అధిష్టానంతో సయోధ్యగా వున్న పార్టీ ముఖ్యులను నియోజకవర్గంలో దూరం పెట్టారు. మరోవైపు వైసీపీ నుంచి ఒక్కొక్కరూ వీడిపోతున్నారు. కూటమిలో చేరిపోతున్నారు.

హవాలాపై నిఘా



- పూర్వపు ఘటనలతో పోలీసులు అప్రమత్తం
- నరసాపురంలో ముమ్మర తనిఖీలు
- చీకటి వ్యాపారుల కదలికలపై డేగకన్ను

అసలే ఎన్నికలు.. కోట్ల రూపాయలు కావాలి. ఇటు చూస్తే డబ్బు తరలించేందుకు ఎక్కడికక్కడ పెద్ద సంఖ్యల్లో చెక్ పోస్టులు. ఏ మాత్రం అనుమానం వచ్చినా పోలీసులు దాడులు చేసి డబ్బును సీజ్ చేస్తున్నారు. అందుకనే చాలా మంది రాజకీయ నాయకులు డబ్బుల కోసం హవాలా మార్గాన్ని ఎన్నుకుంటున్నారు. నరసాపురంలోని బ్రోకర్లను సంప్రదిస్తున్నట్టు సమాచారం. వీరిపై పోలీసులు నిఘా పెట్టారు.

నరసాపురం, మార్చి 30 : హవాలా దందాకు నరసాపురం కేరాఫ్‌గా మారింది. ఎన్నికలు వచ్చాయంటే అభ్యర్థులకు, ప్రధానపార్టీలకు ఇక్కడ నుంచే సొమ్ము బట్వాడా జరిగేది. పోలీసు తనిఖీల్లో ఎన్నో సంఘటనలు వెలుగుచూశాయి. వీటి లింకులన్నీ నరసాపురంతోనే ముడిపడి ఉండటంలో ఈసారి పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు నుంచి ఈ ప్రాంతంపై డేగ కన్నేశారు. ఈ చీకటి వ్యాపారం చేసే కేటుగాళ్ళ కదలికలను గమనిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన కేటుగాళ్లు రూటు మార్చారు. ఎన్నికల కోడ్ రాకుండానే అప్రమత్తమయ్యారు. రెండు, మూడు సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. అక్కడి నుంచే హవాలా రూపంలో సొమ్ము తరలించేందుకు ప్లాన్ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

గత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు డబ్బు తరలింపు సూట్ కేసులు, సంచుల్లో ఉండేది. వీటిని అభ్యర్థులకు అందించేందుకు నానా పాట్లు పడేవారు. కొన్ని సమయాల్లో పోలీసులకు పట్టుబడేవారు. ఈ పని చాలా కష్టంగా ఉండటంతో అభ్యర్థులు రూటు మార్చారు. చేతికి మట్టి అంటకుండా హవాలా రూపంలో తరలిస్తున్నారు. ఈ దందాలో రిస్క్ అంతా హవాలాదారుడిదే. దీనికి కమీషన్ ఎక్కువైనా.. లెక్క చేయడం లేదు. ఇది చీకటి వ్యాపారులకు వరంగా మారింది. సాధారణ రోజుల్లో ఐదు శాతం ఉండే కమిషన్ ఎన్నికల సమయాల్లో 8 నుంచి 10 శాతం వరకు పెంచేస్తున్నారు. పోలీసుల తనిఖీలు ఎక్కువగా ఉంటే ఈ కమిషన్ మొత్తాన్ని మరో రెండు శాతం వరకు పెట్టి డీల్‌ను ఖరారు చేసుకుంటున్నారు. అన్ని సక్రమంగా జరిగితే కోట్ల రూపాయల కమీషన్ అర్జిస్తున్నారు. గడిచిన పదేళ్లుగా ఈ చీకటి దందా తెలుగు రాష్ట్రాల్లో జోరందుకుంది. ఈ చీకటి దందాలో చాలా లింకులు నరసాపురంతోనే ముడిపడుతూ వచ్చాయి. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో డబ్బు తరలిస్తున్న సమయంలో పోలీసులకు పట్టుబడినప్పుడు నరసాపురం పేరే వినిపించింది. దీంతో ఇటీవల తెలంగాణ ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంపైనే డేగ కన్ను వేశారు. జిల్లా నుంచి వచ్చే వాహనాలు, రైళ్లను హైదరాబాద్‌లో క్షుణ్ణంగా తనిఖీ చేసేవారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నరసాపురంపై నిఘా పెట్టారు. తెలుగు రాష్ట్రాల్లో హవాలా రూపంలో క్షణాల్లో కోరినంత సొమ్మును సమకూర్చ గలిగిన సత్తా ఈ ప్రాంతానికి చెందిన కేటుగాళ్ల దగ్గర ఉందన్న పక్కా సమాచారంతో గట్టి నిఘా పెట్టారు. వీరికి చెక్ పెడితే ఎన్నికల్లో డబ్బు పంపిణీని చాలా వరకు నియంత్రించవచ్చన్న భావన పోలీసు వర్గాల్లో నెలకొంది. ఆ దిశగా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటుచేశారు.

అభ్యర్థి ఎంపికైతే ఇక మార్పు ఉండదు

భీమవరం టౌన్, మార్చి 30 : బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఒకసారి పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించిన తర్వాత మార్పు ఉండదని, ఆ పార్టీ క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ తెలిపారు. భీమవరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ, అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు నడ్డాతోపాటు కమిటీ సభ్యులు చర్చించి ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. అందువల్ల మార్పు ఉండదన్నారు.

వైసీపీ సమావేశంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్

ద్వారకా తిరుమల, మార్చి 30 : మండలంలోని కోడిగూడెంలో శుక్రవారం సాయంత్రం జరిగిన వైసీపీ బూత్ కన్వీనర్‌ల సమావేశంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాకుళపు వెంకట్రాజు పాల్గొవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న సమయంలో ఓ పార్టీ కార్యక్రమంలో అతను ఎందుకు పాల్గొన్నాడని, ఇది కోడ్‌ను ఉల్లంఘించడం కాదా.. అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమావేశంలో ఎంతో ఉత్సాహంతో పాల్గొని ఏక్టివ్ రోల్ ప్రదర్శించినట్టు ఈ చిత్రాన్ని చూస్తే అర్థమవుతోంది. ఎన్నికల కమిషన్ స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రాజు (సర్కిల్‌లో)

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

సీ విజిల్‌లో 11 కేసులు పరిష్కరించాం

జేసీ, ఉండి ఆర్వో ప్రవీణ్ ఆదిత్య



- ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ పరిధిలో అధికారులతో టీమ్‌లు ఏర్పాటు చేసి నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నాం. ఉన్నతాధికారులను టీమ్‌లుగా విభజించి ఫ్లెక్సీలు, బోర్డింగ్‌లు, జెండాలతోపాటు ఎన్నికలకు సంబంధించినవి తొలగించాం, ఇంకా ఉంటే తొలగిస్తున్నాం.
- నియోజకవర్గంలో 238 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మరొకటి కావాలని ప్రతిపాదనలు పంపించాం.
- కొత్తగా ఓటు కోసం ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు కార్డులు లేని వారికి ఎన్నికల కమిషన్ ప్రతిపాదించిన 13 రకాల గుర్తింపు కార్డులను తీసుకుని వెళ్లి ఓటు వేయవచ్చు.
- మంచం పట్టి, ఇల్లు కదల్లేని వారు ఇంటి నుంచే ఓటు వినియోగించుకునేందుకు 12డి దరఖాస్తు చేసుకోవాలి.
- నిబంధనలు పాటించని వారిపై ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు ద్వారా, గ్రామస్థాయిలో కార్యదర్శులు, వీఆర్వోలతో నిఘా చేపట్టాం. వాహనాలు కూడా తనిఖీలు చేస్తున్నాం.
- నోడల్ అధికారికి 48 గంటలలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే నిబంధనలు మేర సాయం చేస్తాం.
- సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన, ఇతరులు ఎవరైనా ఫిర్యాదులను చేసినా తహసీల్దార్, ఎంపీడీవోలతో తగు విచారణ చేయించి చర్యలు చేపడతాం. ఉండిలో 9 మంది వలంటీర్లను సస్పెండ్ చేశాం. మండలాల్లో పాలకోడేరులో రూ.10 లక్షలు, ఆకివీడులో రూ.లక్ష, కాళ్లలో రూ.65 వేలు నగదు సీజ్ చేశాం.

- ఆకివీడు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి కృష్ణమోహన్, హాజరైన న్యాయమూర్తులు

వర్క్‌షాపులతో న్యాయ విజ్ఞానం

- రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్

ఏలూరు కలెక్టరేట్/ఏలూరు క్రైం, మార్చి 30 : న్యాయ విజ్ఞానాన్ని పెంచుకోవడానికి న్యాయమూర్తులకు వర్క్‌షాప్‌లు దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అధ్యక్షతన వివిధ అంశాలపై న్యాయమూర్తులకు నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తులకు చట్టంపై స్థూలమైన, విధానపరమైన విజ్ఞానం ఎప్పటికప్పుడు అవసరమన్నారు. వర్క్‌షాపులో రీసోర్స్ పర్సన్స్ సీనియర్ న్యాయవాదులు వై.వి.రవిప్రసాద్, ఎం.సూరిబాబు, రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి ఎం.సాల్మన్‌రాజు పాల్గొని పార్టీషన్, మార్టిగేజ్, మనీ, డిక్లరేషన్, ఇంజెక్షన్ చట్టాలు మారుతున్న సవరణలపైన అవగాహన కల్పించారు. అనంతరం కేసుల విచారణ, పురోగతి తదితర విషయాలను చర్చించారు. తొలుత జస్టిస్ బి.కృష్ణమోహన్ ఏలూరు జిల్లా కోర్టు వద్ద పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్, ఏలూరు బార్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ స్వాగతం పలికారు. మెట్లపై వేసిన కార్పెట్‌ను, లిఫ్టును, సోలార్ సిస్టమ్‌ను, కోర్టు హాళ్లలో ఏసీలను ఆయన ప్రారంభించారు. న్యాయశాఖ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. వివిధ అధికారులతో కోర్టుల్లో మౌలిక సదుపాయాలపై ప్రశ్నించారు. జడ్పీ గెస్ట్‌హౌస్‌లో జస్టిస్ కృష్ణమోహన్‌తో ఎస్పీ మేరీప్రశాంతి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ సమావేశమయ్యారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

భీమవరం, మార్చి 30 : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో కె.శ్రీనివాసులరాజు హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ చేసే సామర్థ్యం ఉన్న ఏ యంత్ర పరికరమైనా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. పుట్టబోయే బిడ్డ లింగ వివరాలను గర్భిణీకి, ఆమె బంధువులకు వెల్లడించరాదని పేర్కొన్నారు.

వంతు వచ్చినా నీరేదీ ?

- చివరకు చేరుతున్న తూడు వ్యర్థాలతో సాగు నీటి కొరత

వీరవాసరం, మార్చి 30 : వీరవాసరం పశ్చిమ కాలువ పరిధి శివారు ఆయకట్టులో ఉన్న మత్స్యపురి భూములకు వంతుల వారీగా వంతు ఇచ్చినా నీరు చేరని పరిస్థితి. ఎగువ ప్రాంతంలో తొలగించిన తూడు నీటి ప్రవాహంలో కొట్టుకు వచ్చి చివరకు చేరడంతో నీరు భూములకు చేరడం లేదు. ఇటీవలే జలవనరుల శాఖ అధికారులు పశ్చిమ కాలువ ఎగువ ప్రాంతం నుంచి తూడు తొలగింపు చేపట్టారు. ఈ తూడును నిలిచిన చోట నీటి నుంచి తీసి గట్టున వేయాలి. అలా కాకుండా ప్రవాహంలో కిందకు వదిలి వేస్తున్నారు. వీరవాసరంలోని మూడు డ్యాంల వద్ద తూడు వ్యర్థాలు చేరి నిలిచి ఉంటుంది. ఇక్కడే ఈ తూడును తొలగించి గట్టున వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకుండా డ్యాంలు తెరిచి నీటి ప్రవాహంలో కిందకు వదిలివేశారు. అసలు సమస్య ఇక్కడే ప్రారంభమైంది. ప్రస్తుతం ఆయకట్టుభూమి పొట్ట దశకు చేరింది. ఈ సమయంలోనే నీటి అవసరం ఎంతో ఉంటుంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా 'వంతు ఇస్తున్నాం తీసుకోండి' అంటూ దాట వేయటమే తప్ప తూడు తొలగించడం లేదు. ఏప్రిల్ 4వ తేదీతో మత్స్యపురి ఆయకట్టుకు సంబంధించిన వంతు సమయం ముగుస్తుంది. ఈ సీజన్‌లో ఇదే చివరి వంతు. తదుపరి మంచినీటి చెరువులకు, పశువుల చెరువులను నీటితో నింపేందుకు నీరు విడుదల చేస్తారు. చివరి వంతు సమయం అవుతున్నప్పటికీ నీరందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.





పశ్చిమకాలువ శివారులో తూడుతో నిండిన కాలువ



వీరవాసరం మూడు డ్యాంల వద్ద తూడు తొలగించగా ఇలా

ఉండి వెలివర్రు వంతెన వద్ద బొండాడ డ్రెయిన్‌లో పేరుకున్న గుర్రపు డెక్క.

బొండాడ డ్రెయిన్‌లో నిలిచిన గుర్రపు డెక్క

నీరు పారక రైతుల ఇక్కట్లు

ఉండి, మార్చి 30: బొండాడ డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. తరచూ ఈ వంతెన వద్ద గుర్రపు డెక్క పేరుకు పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బొండాడ డ్రెయిన్ ఉండి మండలం పాములపర్రు శివారు కొండగుడెం నుంచి ప్రవహిస్తూ పాములపర్రు మీదుగా ఉండి, వెలివర్రు వంతెన, వాంద్రం వరకు వెళుతుంది. అక్కడ నుంచి కాళ్ల మండలంలోకి ప్రవహిస్తోంది. ఈ డ్రెయిన్ వెంబడి వరి చేలు, ఆక్వా చెరువులు సాగవుతున్నాయి. ఈ డ్రెయిన్ వేసవిలో సాగునీటి సమస్య తలెత్తినప్పుడు ఈ డ్రెయిన్ ఎంతో ఉపయోగకరంగా వుంటుంది. అటువంటి డ్రెయిన్‌లో ప్రస్తుతం గుర్రపు డెక్క, తూడు, చెత్తలు పేరుకుపోయాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. 'బొండాడ డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్త, తూడు తక్షణం తొలగించాలి. డ్రెయిన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి' అని ఉండికి చెందిన రైతు రాము కోరారు. 'వేసవిలోగా బొండాడ డ్రెయిన్ అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి' అని రైతు హరినాధరాజు అని కోరారు.



రంగులు మార్చారు

పెంటపాడు, మార్చి 30 : ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన ఇంకా రంగుల్లోనే కార్యాలయాలు కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని బోడపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఇనుప స్థంభాలకు వేసిన వైసీపీ రంగులను అధికారులు తొలగించారు.

వీటి మాటేమిటి ?





వైసీపీ రంగులు వేసి హంగులతో ముస్తాబు చేసిన వాహనాలకు ఎన్నికల కోడ్ వచ్చినా రంగులు మాత్రం తొలగించడం లేదు. గ్రామాలలో చెత్త సేకరించే రిక్షాలకు వైసీపీ రంగులు వేసారు. వాటిపై నాయకుల బొమ్మలకు స్టిక్కర్లు వేశారు కానీ రంగులు తొలగించ లేదు. రేషన్ పంపిణీ చేసే వాహనాలదీ ఇదే పరిస్థితి. సీఎం జగన్ బొమ్మ కానబడకుండా పేపర్ అతికించారు. రంగులు తొలగించలేదు. ఈ నెల 1 వ తేదీ నుంచి రేషన్ పంపిణీ జరగనుంది. తడిచెత్త, పొడిచెత్త సేకరించే వాహనాలకు వేసిన వైసీపీ రంగులు తీయలేదు. మరి వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇక్కడ ఇలా..!



ఆకివీడు, మార్చి 30: ఆకివీడులో శనివారం వైసీపీ రంగులతో ఉన్న వాహనంతో పన్నులు చెల్లించాలంటూ మైకులో చెబుతున్నారు. నిబంధనలు పాటించాల్సిన అధికారులే ఈ విధంగా ఉంటే ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నట్లు అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఉప్పుటేరు చెక్‌పోస్టు వద్ద సూచనలు చేస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

చెక్‌పోస్టులు మరింత కట్టుదిట్టం : జేసీ ప్రవీణ్ ఆదిత్య

ఆకివీడు రూరల్ మార్చి 30 : జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టులను మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు జేసీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ఆకివీడు మండలం ఉప్పుటేరు వద్ద ఉన్న చెక్‌పోస్టును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీలను రిజిస్టర్‌లో నమోదు చెయ్యాలని సూచించారు. రాత్రిపూట చెక్ చేసేందుకు లైట్లు ఏర్పాటు చెయ్యాలని, సీసీ కెమెరా ఏర్పాట్లును పరిశీ లించారు. ఏలూరు వంతెన వద్ద పరిశీలించి అవసరమైతే చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎస్ఐ నాగబాబు, పంచాయతీ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

66 లీటర్ల మద్యం..2.43 లక్షల నగదు స్వాధీనం

ఏలూరు క్రైం,మార్చి 30 :ఎన్నికల దృష్ట్యా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 66.65 లీటర్ల మద్యం (రూ.24 వేలు) రెండు లక్షల 43 వేల 400 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికి 31 ఫ్లైయింగ్ సర్వైలెన్స్ టీమ్‌లు ఆకస్మికంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాయన్నారు.ఓటర్లను ఎవరైనా ప్రలోభపెట్టినా, వారికి ఆటంకం కల్గించినా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణపవరంలో లక్షా 6 వేలు స్వాధీనం

గణపవరం, మార్చి 30: ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చర్యలు తప్పవని ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావల్లి స్పష్టం చేశారు. శనివారం గణపవరంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం జరిపిన తనిఖీల్లో లక్షా 6 వేల రూపాయలు సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును స్ట్రాంగ్‌రూమ్‌లో అప్పగించామన్నారు.

గంజాయి కేసుల్లో ఉన్నవారిని అరెస్టు చేయండి : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 30 : గంజాయి కేసుల్లో ఉన్న ముద్దాయిలు పరారీలో ఉన్నట్లయితే తక్షణం వారిని అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు పోలీస్ కార్యాలయం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్‌లో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి కేసులో ఉన్న ముద్దాయిలపై నిఘా ఏర్పాటు చేయాలని, ఇప్పటికే పరారీలో ఉన్నవారిని అరెస్టు చేసి కోర్టులలో హాజరు పర్చాలని ఆదేశించారు.

పాపికొండల్లో జలధార వృక్షం



పోలవరం, మార్చి 30 : పోలవరం మండలం పాపికొండల అభయారణ్యంలో అరుదైన జలధార వృక్షం కనిపించడంతో ఆ వీడియోలు శనివారం ప్రసార మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నీటి నిల్వలను దాచుకునే తత్వం కలిగిన నల్లమద్దిగా పిలవబడే వృక్షం పాపికొండల నేషనల్ పార్కులో కింటుకూరు అటవీ ప్రాంతంలో బేస్ క్యాంప్ పరిశీలనకు వెళ్లిన అటవీశాఖ సిబ్బందికి కనిపించింది. పరిశీలన కోసం వృక్షానికి కొంతమేర గాటు పెట్టగా ఆ గాటు నుంచి నీరు ఎగదన్నింది. అటవీశాఖ క్షేత్రాధికారి దావీదురాజు మాట్లాడుతూ వాడుక భాషలో నల్లమద్ది, చంద్రమద్దిగా పిలవబడే ఈ వృక్షానికి 20 నుంచి 40 లీటర్ల వరకు నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం కలిగి ఉంటుందని, వీటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక గిరిజనులు మాట్లాడుతూ పూర్వం అడవుల్లో వేటకు వెళ్లిన వారు దాహార్తిని తీర్చుకోవడానికి ఈ వృక్షానికి గాట్లు పెట్టి ఆ నీటిని తాగేవారన్నారు. ఆ నీటిలో ఔషధ గుణాలున్నాయని చాలా మంది నమ్ముతారని లీటరు నీటిని రూ.వెయ్యికు కూడా కొనేవారని తెలిపారు.

ముద్ద దిగట్లే!



భీమవరంలోని ఒక స్కూల్లో ముద్దగా ఉన్న మధ్యాహ్న భోజనం

రేషన్ ద్వారా 1121 రకం బియ్యం సరఫరా
వండితే ముద్ద..ముద్ద
మధ్యాహ్న భోజన పథకానికి ఇవే బియ్యం
విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం

భీమవరం రూరల్, మార్చి 30 : రేషన్ ద్వారా సన్న బియ్యం, నాణ్యమైన బియ్యం ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. నాణ్యత మాట దేవుడెరుగు.. ఆ బియ్యం తింటుంటే అరగక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవే బియ్యం పాఠశాలల మధ్యాహ్న భోజన పథకానికి వినియోగిస్తున్నారని విద్యార్థులకు కడుపునొప్పి సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. అన్నం ముద్దయిపోతోందని చెబుతున్నారు. మధ్యాహ్నం భోజనం పథకంలో విద్యార్థులు భోజనం చేసిన తరువాత వాంతులు అవుతున్న సంఘటనలు పలు చోట్ల చోటు చేసుకున్నాయి. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే కారేజీలు పట్టుకెళ్తున్నట్లు పరిస్థితులు ఉన్నాయి.

జిల్లాలో రేషన్ చౌకడిపోల ద్వారా నెలనెలా 5 లక్షల 70 వేల కార్డుదారులకు 8600 మెట్రిక్ టన్నుల బియ్యం సివిల్ సప్లయ్ ద్వారా అందించడంతో పాటు జిల్లాలోని 1,374 ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి అందిస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో మధ్యాహ్న భోజన పథకానికి గాని, అంగన్‌వాడీ కేంద్రాలకు గాని పాత బియ్యం, అరుగుదల వీలుగా ఉండే స్వర్ణ రకం బియ్యం ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వంలో నాణ్యమైనవి, పోషకాహార విలువలు ఉన్నవి అంటూ ఒకటే బియ్యం అందిస్తున్నారు. రైతుల లెక్క ప్రకారం సన్న బియ్యం అంటే సోనా రకం. లావు బియ్యం అంటే స్వర్ణ వంటివి.మన ప్రాంతాల్లో స్వర్ణ, 1121, ఇలాంటి రకాల సాగు ఎక్కువ. ప్రభుత్వం ద్వారా రేషన్, మధ్యాహ్న భోజన పథకానికి ఇచ్చే బియ్యం రకం 1121. ఈ రకం బియ్యం తినడానికి వీలుకాని దని రైతులే నిర్ధారించారు. వీటిని జాగ్రత్తగా వండకపోతే అయితే ముద్దయి పోతుందని లేదంటే ఉడకకుండా పలుకులుగా ఉంటుందని మధ్యాహ్న భోజన పథకం వంట వండేవారే చెబుతున్నారు. గతంలో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక ట్యాగ్ ఉన్నవాటినే సరఫరా చేసేవారు.

ఉడకని బియ్యంతో ఎసిడిటీ సమస్యలు

స్వర్ణ, సంపత్ రకాలు తినడానికి బావుంటాయి. గతంలో వీటిని ఇచ్చేవారు. వీటి సాగు తగ్గిపోవడంతో దాళ్వా పంటలో 1010 రకం ఎక్కువగా సాగు చేసేవారు.అయితే ఈరకం బియ్యం కూడా అంతంగా ఉపయోగపడేది కాదు. దీంతో గత ప్రభుత్వాలు సార్వాలో పండించే స్వర్ణ రకం, 1061 వంటివే రేషన్, మధ్యాహ్న పథకానికి అందించేవారు. అన్నం తినడానికి వీలుకాని బియ్యం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. జీర్ణాశయానికి ఇబ్బంది ఏర్పడుతుంది. దాని వల్ల విరోచనాలు, వాంతులతో పాటు ఎసిడిటీ సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

అప్పుడే.. భగభగలు



శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయం రోడ్డు

మండుతున్న ఎండలు..40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

పాలకొల్లు అర్బన్, మార్చి 30 : ఇంకా వేసవి రాకముందే ఎండలు మండిపోతున్నాయి. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. పాలకొల్లులో శనివారం వారపు సంత వెలవెలబోయింది. ఎండ వేడిమికి ప్రజలు అవస్థలు పడ్డారు. ఉదయం 10 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపడంతో వీధులు నిర్మానుష్యంగా మారాయి.శీతల పానీయాలకు, కొబ్బరి బొండాలకు గిరాకీపెరిగింది.

జాగ్రత్తలు తప్పనిసరి



లంకల కోడేరు పీహెచ్‌సీ డాక్టర్ నవ్య

వేసలవిలో పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఎండలు పెరిగిన దృష్ట్యా తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ నవ్య పలు సూచనలు చేశారు.

వడదెబ్బ లక్షణాలు.. జాగ్రత్తలు

వడ దెబ్బ తగిలితే చెమట పట్టడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి ఏర్పడతాయి. అధిక ఉష్ణోగ్రత (వేడి) ఉండే సమయంలో బైట ఎక్కువగా తిరగ కూడదు. రోడ్లపక్కన విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగరాదు, మాంసాహారం తగ్గించాలి. తాజా కూరగాయల్ని ఆహారంగా తీసుకోవాలి, మద్యం సేవించరాదు.

మంచినీరు, పండ్లరసాలు, కొబ్బరి నీళ్ళు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. నలుపురంగు మందంగా ఉండే దుస్తులకు బదులుగా లేత రంగులు కలిగిన తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. రోజూ కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహారం తక్కువగా ఎక్కువసార్లు తీసుకోవాలి. ఎండ వేళల్లో ఇంటిపట్టునే ఉండాలి. బయటికి వెళ్ళాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి ధరించి వెళ్లడం మంచిది. ఇంట్లో కిటికీలు తెరచి ఉంచుకోవాలి.

ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వారిని త్వరగా నీడ ఉండే ప్రదేశానికి చేర్చాలి. చల్లటి నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం అంతా తుడవాలి.శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకూ ఇలాగే చేస్తూండాలి. ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలే విధంగా చూసుకోవాలి.ఉప్పు కలిపిన మజ్జిగను కానీ కొద్దిగా ఉప్పు కలిపిన గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రిహైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్నవారికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలి.

పట్టిసీమ ఎత్తిపోతల వద్ద డీసిల్టింగ్ పనులు



పోలవరం, మార్చి 30 : పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో డీసిల్టింగ్ పనులు చేపట్టినట్లు ఏఈ వినోద్ తెలిపారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో 24 పంపులలో పేరుకు పోయిన సిల్టు తొలగింపు పనులు శిక్షణ పొందిన ఆరుగురు డ్రైవర్లతో ప్రారంభించడం జరిగిందని ఇప్పటి వరకూ రెండు పంపులలో సిల్టు తొలగించారని 3వ పంపులో సిల్టు తొలగింపు పనులు జరుగుతున్నాయని తెలి పారు. గోదావరిలో నీటి మట్టం తక్కువగా ఉండడం వల్ల పనులు ప్రారం భించామని మరో 21 పంపులలో సిల్టు తొలగింపు పనులు కూడా వేగవంతంగా జరుగుతాయని తెలిపారు.





తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కాలేజీ విద్యార్థినులు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. కాలేజీలో జర్నలిజం కోర్సు చదువుతున్న విద్యార్థినులకు 'వార్తల సేకరణ-ప్రింటింగ్ విధానం'పై కార్యాలయ ఉద్యోగులు అవగాహన కల్పించారు. బీఎం హరిబాబు, కాలేజీ జర్నలిజం కో-ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ద్వారకాతిరుమల ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు

ద్వారకాతిరుమల, మార్చి 30: ద్వారకా తిరుమలవాసునికి హుండీల లెక్కింపు ద్వారా గడచిన 17 రోజుల కాలానికి రూ.1.52 కోట్ల రూపాయల భారీ ఆదాయం సమకూరింది. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో శనివారం హుండీ ఆదాయం లెక్కించారు. రూ.1,52,94,247 నగదుతో పాటు 320 గ్రాముల బంగారం, 3.392 కేజీల వెండి లభించినట్లు ఈవో త్రినాధరావు తెలిపారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (7), 1000(3), 2000(14)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.

భక్తుల తాకిడి



శనివారం భక్తజనులతో కిటకిట లాడింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దీంతో అన్ని విభాగాలు యాత్రికులతో సందడిగా మారాయి.వేలాది మంది యాత్రికులు క్షేత్రానికి చేరుకుని తమ మొక్కు బడులు తీర్చుకున్నారు. దాదాపు 20 వేల మంది వరకూ భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారుల అంచనా.

శ్రీవారి క్షేత్రంలో వచ్చే నెల 9న ఉగాది ఉత్సవం

ద్వారకాతిరుమల, మార్చి 30 : శ్రీవారి క్షేత్రంలో వచ్చేనెల 9న ఉగాది ఉత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు తెలిపారు. ఉగాది ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలను పుష్పమాలికలు, మామిడి తోరణాలతో అలంకరిస్తామన్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీవారు ఉభయదేవేరులతో శేషవాహనంపై కొలువై ఉగాది మండపం వద్దకు వస్తారని తెలిపారు. అనంతరం పంచాంగశ్రవణం, పండిత సత్కారం జరుగుతుందని తెలియజేశారు.

ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు అదనపు ఏసీ కోచ్

నరసాపురం, మార్చి 30: వేసవిలో ఏసీ బోగీలకు ఉండే రద్దీని పరిగణలోకి తీసుకుని నరసాపురం ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా మరో ఏసీ కోచ్‌ను కేటాయించారు. ప్రస్తుతం నాలుగు ఏసీ త్రీటైర్, మరో ఏసీ టూటైర్ కోచ్‌లతో ఈ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. ఇవి కాకుండా ఏసీ ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్ సగం సగం సీట్లు కలిగిన మరో బోగీని అదనంగా జత చేస్తున్నారు. మే ఒకటి వరకు ఈ కోచ్ నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.



5 వరకు మారంపల్లి రైల్వే గేటు మూత

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 30: మండలంలోని మారంపల్లి రైల్వే గేటును శనివారం మూసివేశారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఏప్రిల్ 5 వరకూ గేటును మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు బోర్డు ఏర్పాటుచేశారు. దీంతో జగన్నాథపురం, మాధవరం, దండగర్ర తదితర ప్రాంతాల వారు ఆరుళ్ళ, మారంపల్లి వెళ్లాలంటే నవాబుపాలెం మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

క్రైం కార్నర్

గోదావరిలో మునిగి యువకుడి మృతి



పుల్లారావు(ఫైల్)

తాళ్లపూడి/చాట్రాయి, మార్చి 30: ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం నరసింహారావు పాలెం శివారు సిగుడిపాడుకు చెందిన బిలుగుది పోతయ్య కుటుంబ సభ్యులతో మొక్కులు తీర్చుకునేందుకు శనివారం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వ రపురంలోని మేరీమాత చర్చికి వచ్చారు. జపమాల ధరించిన వీరు గోదావరిలో స్నానాలకు వెళ్లగా వీరి కుమారుడు పుల్లారావు (20) ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయినట్టు పోతయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పుల్లారావు మృత దేహాన్ని నది నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు.

సి. గుడిపాడులో విషాద చాయలు

పుల్లారావు అవివాహితుడు. తల్లిదండ్రులు పోతయ్య, చుక్కమ్మలకు ఒక కుమార్తె, కుమారుడు. కుమార్తెకు వివాహమైంది. కుమారుడు పుల్లారావు పెళ్లిళ్ల, ఇతర శుభ కార్యాలకు డెకరేషన్ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. సి.గుడిపాడులో విషాద చాయలు నెలకొన్నాయి.

భీమవరంలో మావోయిస్టు అరెస్టు

భీమవరం క్రైం, మార్చి 30 : భీమవరంలో మావోయిస్టు అరెస్టు కలకలం రేగింది. శుక్రవారం అర్ధరాత్రి ఒక యువకుడ్ని పోలీసులు పట్టుకున్నారు. భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నలుగురు మావోయిస్టులను కొంతకాలం క్రితం అక్కడ పోలీసులుఅరెస్టు చేశారు.వారితో ఉండే మరో మావోయిస్టు రాహుల్ కేసరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాహుల్ కేసరి 15 రోజుల క్రితం భీమవరం వచ్చి తాపీ పనిచేస్తుకుంటూ భీమవరం ఏఎంసీలో ఉంటున్నాడు. కొంతకాలం హైద్రాబాద్‌లో తలదాచుకుని 15 రోజుల క్రితం భీమవరం వచ్చినట్లుగా తెలిసింది. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా జార్ఖండ్ పోలీసులు భీమవరం పోలీసుల సహాయం తీసుకుని జల్లెడపట్టి శుక్రవారం రాత్రి రాహుల్ కేసరిని భీమవరంలో అరెస్టు చేశారు. అతడిపై అరెస్టు వారెంటు ఉండటంతో పోలీసులు అతన్ని తీసుకువెళ్ళినట్లు సీఐ తెలిపారు.


విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి

లింగపాలెం, మార్చి 30: లింగపాలెం మండలంలో విద్యుత్‌షాక్‌తో ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బండారు లక్ష్మణరావు (55) అనే వ్యక్తి గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మండలంలోని అయ్యప్పరాజుగూడెం పంచాయతీ ప్రగతిపురం కాలనీలో ఓ ఇంట్లో విద్యుత్ పనులు చేస్తుండగా కరెంటు షాక్‌కు గురవడంతో వెంటనే గ్రామస్థులు, ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై పి.చెన్నారావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే లక్ష్మణరావు చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు.

మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం

పాలకోడేరు, మార్చి 30 : మనస్తాపంతో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గొల్లలకోడేరు గ్రామంలోని బీడులో శనివారం చోటు చేసుకుంది. బాబూరావు అనే వ్యక్తి మురుగు వెళ్లేందుకు ఇరిగేషన్ కాల్వగట్టుపై డ్రెయిన్ ఏర్పాటు చేసుకుంటున్నాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన గాడి ఉమా మహేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి తన భార్య స్నానం చేస్తుండగా సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండడం బాబురావు చూసి ప్రశ్నించాడు. తనను తన ఓనర్ పంపించాడని డ్రెయిన్ ఫోటోలు తీయమన్నాడని బదులిచ్చాడు.ఈ సంఘటనతో మనస్థాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఆసుపత్రిలో చికిత్స నుంచి కోలుకున్న బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీడియో చిత్రీకరిస్తున్న ఉమామహేశ్వరావుతో పాటు, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉంటే ఇరిగేషన్ కాలువ గట్టుపై డ్రెయిన్ తవ్వకుంటున్న కాటం బాబురావుపై ఇరిగేషన్ ఏఈ ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటు తుపాకులు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



కైకలూరు, మార్చి 30: అనుమతులు లేకుండా నాటు తుపాకులను ఉపయోగిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామవరంలో వేర్వేరు ప్రదేశాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నాటు తుపాకులు కల్గిన వీరు తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రవీణ్ స్మిత్, ఎడ్విన్ జాయ్‌గా గుర్తించామని, తుపాకులు స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఎస్సై టి. రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్
ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



స్తంభాన్ని ఢీకొట్టిన బైక్.. మృతి చెందిన సాయికృష్ణ

ద్వారకాతిరుమల, మార్చి 30: మోటార్ సైకిల్‌కు కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ద్వారకా తిరుమల మండలం కొమ్మర గ్రామానికి చెందిన సాయికృష్ణ, సంతోష్‌లు తాపీ పనిచేస్తుంటారు. శుక్రవారం సాయంత్రం తాపీపని డబ్బుల కోసం రాళ్లకుంట గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి వారి బైక్‌కు కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కరెంటుస్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో ఇద్దరి తలకు బలమైన గాయాల య్యాయి. స్థానికులు కుటుంబసభ్యులు వారిని వెంటనే ఏలూరు ఆసుపత్రికి తరలించారు. సాయికృష్ణ (19) పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని విజయవాడకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న సంతోష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దువ్వ జాతీయ రహదారిపై కారు ప్రమాదం

తణుకు, మార్చి 30 : విజయవాడ నుంచి భీమవరం వెళుతున్న కారు దువ్వ కొత్త వంతెన సమీపంలో శనివారం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగే సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. అయితే కారు బెలూన్‌లో తెరచుకోవడంతో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగ లేదు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో రోడ్డు భద్రతా సిబ్బంది ట్రాఫిక్‌ను అంతరాయం లేకుండా వాహనాలను పంపించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

టి.నరసాపురం, మార్చి 30 : నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ ఎం.రాజు తెలిపారు.గండిగూడెం గ్రామంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆదివారం సిబ్బందితో దాడి చేశారు. అతని వద్ద నుంచి ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

పిఠాపురం ప్రచారంలో కొత్తపల్లి



నరసాపురం, మార్చి 30: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శనివారం పిఠాపురంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు కూడా పాల్గొన్నారు. హెలీప్యాడ్‌లో ఆయనకు బొకే అందించి స్వాగతం పలికారు. పవన్ పిలుపు మేరకు ఆయన పిఠాపురంకు వెళ్లినట్లు కొత్తపల్లి అనుచరులు తెలిపారు. ఇటీవల కొత్తపల్లిని తాడేపల్లి పిలిచి పవన్ చర్చించారు.

జీతభత్యాలకు కౌన్సిల్ సమావేశం

ఆకివీడు, మార్చి 30: నగర పంచాయతీ పరిధిలో సాధారణ నిధులు, జీత భత్యాలకు సంబంధించి నిల్వలు, ఆదాయం, వ్యయాలపై శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించినట్టు కమిషనర్ జి.కృష్ణమోహన్ తెలిపారు. నగర పంచాయతీ ప్రారంభ నిల్వలు 2023 ఏప్రిల్ 1నాటికి రూ.3,97,66,891 ఉండగా 2024 మార్చి22కి ఆదాయం రూ.3,40,17,178 వచ్చింది. మొత్తం నిల్వ రూ.7,37,84,069 ఉంది. దీనిలో వ్యయం రూ.3,79,47,275 పోగా నిల్వ రూ.3,58,36,794 ఉందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్వరరావు, చైర్మన్ జామి హైమావతి, వైస్ చైర్మన్లు పప్పాల పండు, వంగా జోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైసీపీ,టీడీపీ, జనసేన కౌన్సిలర్లు ఉన్నారు.

టీడీపీ నాయకుల్ని కలిసిన ఎంపీ అభ్యర్థి వర్మ

నరసాపురం టౌన్, మార్చి 30: బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీనివాసవర్మ శనివారం నరసాపురం విచ్చేసి టీడీపీ నాయకుల్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా పార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు నివాసానికి వెళ్లారు. ఎన్నికల్లో కూటమి విజయానికి సహకరించాలని కోరారు. ఆ తరువాత టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు నివాసానికి వెళ్లారు. ఆ తరువాత బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు.

స్వతంత్ర అభ్యర్థి శివ ప్రచారం



ఆకివీడు రూరల్ మార్చి 30 : గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తానని ఉండి నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థి కలవపూడి శివ అన్నారు. పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, తరటావ, అప్పారావుపేట గ్రామాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. గుమ్ములూరు గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఆటోపై గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. మహిళలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

బొలిశెట్టిని విమర్శించే అర్హత లేదు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 30: తమ నాయకుడు బొలిశెట్టి శ్రీనివాస్‌ను విమర్శించే అర్హత ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్‌కు లేదని జనసేన దళిత నాయకులు మండిపడ్డారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో జనసేన దళిత నాయకులు ఎర్రపాటి రాజు, చేపల రమేష్, గెడ్డం సల్మాన్‌రాజు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం అభివృద్ధిని పట్టించుకోని వారికి నిత్యం ప్రజలతో మమేకమై ఉంటున్న బొలిశెట్టిని విమర్శించడం విడ్డూరమన్నారు.

సాయుధ బలగాల కవాతు



తణుకులో పోలీసుల కవాతు

తణుకు, మార్చి 30: ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పట్టణంలో సాయిధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. శనివారం పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కవాతు చేశారు. పట్టణ సీఐ నాగరాజు, ఎస్ఐ జానా సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం: సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించినా చర్యలు తీసుకుంటామని నిడమర్రు సీఐ ఎండీ సుభాష్ హెచ్చరించారు. శనివారం గణపవరం మండలంలోని మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, మల్లపురాజుపేట, జల్లికాకినాడ గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజలు నిష్పక్షపాతంగా ధైర్యంగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. గణపవరం ఎస్సై వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత



పాలకొల్లు టౌన్, మార్చి 30: పాలకొల్లు టిడ్కో గృహ సముదాయాలలో నివసిస్తున్న మానసిక దివ్యాంగుడు బొల్లా చరణ్‌కు వీల్‌చైర్‌ను శనివారం పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, క్లబ్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్‌సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్‌రావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, నంబూరి గంగాపవన్ పాల్గొన్నారు.

'హార్బర్ కట్టేది మేమే'

నరసాపురం రూరల్, మార్చి 30: మరోసారి అధికారం ఇస్తే బియ్యపుతిప్ప హార్బర్ పనుల్ని పూర్తి చేస్తామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని బియ్యపుతిప్ప గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రూ.400 కోట్లతో కార్గో హార్బర్ నిర్మిస్తున్న ఘనత తమకే దక్కనుందన్నారు. దీని వల్ల తీర ప్రాంత రూపురేఖలే మారతాయన్నారు.

చిన్నారుల ఫుడ్‌ఫెస్టివల్



భీమవరం టౌన్, మార్చి 30: ఆ చిన్నారులు పుస్తకాలు పట్టి చదవడమే కదండయో .. గరిట పట్టి వంటకాలు కూడా అద్భుతంగా చేస్తారు.. రుచికరమైన నోరూరించే సుమారు 400రకాల పిండి వంటలతో అద్భుతంగా ప్రదర్శన చేశారు. శ్రీ విద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకున్నది. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎం.గోవింద బాబు ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. చెరుకువాడ రంగసాయి, స్కూల్ హెచ్‌ఎం భవానీ పాల్గొన్నారు.

జేవీఆర్ మృతి టీడీపీకి తీరని లోటు



జేవిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు

మొగల్తూరు, మార్చి 30: మొగల్తూరు మాజీ జడ్పీటీసీ సభ్యుడు, తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు (జేవీఆర్) మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం కాళీపట్నం పడమర గ్రామంలో నిర్వహించిన జక్కంశెట్టి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి చివరి నిమిషం వరకూ పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా జక్కంశెట్టి ఎంతగానో కృషి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, జడ్పీటీసీ కుక్కల మీరయ్య, చింతపల్లి గురుప్రసాద్, కాళీపట్నం సర్పంచ్ కవురు సావిత్రి ఆదినారాయణ, వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

వీరవాసరం, మార్చి 30: పంటలకు మద్దతు ధర కల్పించకుండా వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నష్టాల పాలు చేస్తున్నదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హారేరాం అన్నారు. రైతులు నష్టపోతే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పటానికి తేలికగా ఉంటుందని మోదీ ప్రభుత్వం భావిస్తుందని విమర్శించారు. శనివారం వీరవాసరం ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం మండల కమిటీ సమావేశాన్ని రెడ్డి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాగు నీటి కాలువలు మురుగు డ్రెయిన్లు మరమ్మతులు చేయకపోవటం వలన సాగు,తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి, మార్చి 30: విద్యుత్ మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉండి, వెలివర్రు, చిలుకూరు, ఎన్ఆర్‌పిఅగ్రహారం, పెదపుల్లేరు, చెరుకువాడ, కలిసిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పీర్ అహ్మద్‌ఖాన్, ఏఈ మాధవరాజు తెలిపారు.






వైసీపీ నాయకుడు వెంకన్నకు టీడీపీ కండువా కప్పిన ఎమ్మెల్యే నిమ్మల.. యలమంచిలిలో ప్రచారం చేస్తున్న నిమ్మల సూర్యకుమారి.. తణుకులో వాకర్స్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి.. ఉప్పరగూడెంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రామరాజు

సూపర్ సిక్స్ పథకాలతో మహిళా సాధికారత: పితాని

పెనుమంట్ర, మార్చి 30: సూపర్ సిక్స్ పథకాలతో మహిళా సాధికారత సాధ్యపడుతుందని ఆచంట టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం వెలగలేరులో పితాని ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అవినీతి అరాచక పాలన పోవాలంటే సైకిల్ పాలన రావాలని, జనసేన టీడీపీ బీజేపీ కూటమి అభ్యర్థులను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్లకు వలంటీర్లు తాయిలాలను అందించటమే గాక వైసీపీ కార్యకర్తలుగా పనిచే యడం సరికాదన్నారు. ప్రజా ధనాన్ని గౌరవ వేతనంగా తీసుకుని పార్టీలకు కొమ్ము కాయడం సరికాదని హితవు పలికారు.




వెలగలేరులో పితాని పాదయాత్ర.. ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం జనసేన అభ్యర్థి అంజిబాబు




పేరుపాలెం, పెంటపాడులలో జనసేన అభ్యర్థులు నాయకర్, బొలిశెట్టిల ప్రచారం

పాలనంటే కక్షసాధింపు కాదు: అంజిబాబు

భీమవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాలన అంటే కక్ష సాధింపులు, బెదిరింపులు కాదని తెలుగుదేశం కూటమి ఉమ్మడి అభ్యర్థి, జనసేన నాయకులు పులపర్తి అంజిబాబు అన్నారు. అందరిని కలుపుకొని వెళ్లడమే నిజమైన పాలన అని తెలిపారు. భీమవరం 34వ వార్డులో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకులు యాసా అనిల్, కొండవీటి అజయ్‌లు అధ్యక్షత వహించారు. రాష్ట్ర భవిష్యత్తు మారాలంటే అది ఓటుతోనే సాధ్యపడుతుందని అంజిబాబు అన్నారు. జగన్ పాలనలో హంగులే తప్పా అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. చెత్తకు కూడా పన్ను తీసుకుంటున్న చెత్త ప్రభుత్వమని విమర్శించారు. జనసేన రాష్ట్ర నాయకులు వేగేశ్న కనకరాజు సూరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గడచిన ఐదేళ్లనుంచి ప్రజలు భయభ్రాంతులతో బ్రతుకుతున్నారని, దుర్మార్గపు ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ గాదిరాజు తాతరాజు, బంగార్రాజు, గంటా త్రిమూర్తులు, పంతం సతీష్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో మళ్లీ టీడీపీ జెండా: ఎమ్మెల్యే రామరాజు

ఉండి, మార్చి 30: ఉండి నియోజకవర్గంలో మరోసారి తెలుగుదేశం జెండా ఎగురుతుందని తెలుగుదేశం కూటమి ఉమ్మడి అభ్యర్థి, ఎమ్మెల్యే రామరాజు అన్నారు. ఉప్పరగూడెంలో ఆయన శనివారం పర్యటించారు. ఆంజనేయస్వామి పునఃప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. తెలుగుదేశం హయాంలోనే ఉండి నియోజకవర్గం ప్రగతి సాధించింది. ఆక్వా రంగం అభివృద్ధి చెందింది. మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. ఈ సారి కూడా అభివృద్ధి కోసం జనసేన, బీజేపీలు కూడా తెలుగుదేశంతో జత కూటమిగా ఏర్పడ్డాయని ఎమ్మెల్యే రామరాజు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే ఆక్వా రంగానికి రాయితీలు కల్పిస్తామని, జోన్‌తో సంబంధం లేకుండా రూ. 1.50లకే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. జనసేన ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజు, మండల ప్రెసిడెంట్ కరిమెరక నాగరాజు, మంతెన నరిసింహరాజు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

పాలకొల్లు రూరల్, మార్చి 30 : సీనియర్ వైసీపీ నాయకుడు, 19వ వార్డు ఇన్‌చార్జి గాదె వెంకన్న శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. చింతపర్రు గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే రామానాయుడు వద్దకు వెంకన్న వెళ్లారు. ఈసందర్భంగా వెంకన్నకు పార్టీకండువా కప్పి, పూలమాలలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేని రోజారమణి, పార్టీ నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, వెంకన్న, పొట్నూరి శ్రీనివాస్, బిరుదు కోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి: ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు రూరల్, మార్చి 30 : వైసీపీ వాళ్ళు ఇచ్చేది ప్రజల డబ్బేనని, వారు ఎంత డబ్బు ఇచ్చినా ఓటు మాత్రం సైకిల్ గుర్తుకు వేయాలని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. చింతపర్రులో శనివారం ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌తో కలిసి నిర్వహించారు. ముందుగా గ్రామంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10 ఏళ్ళగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా నియోజక వర్గ అభివృద్ధికి పాటుపడ్డానని రామానాయుడు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ అంగర, గ్రామ నాయకులు మల్లి ఖార్జునరావు, పెన్మెత్స శ్రీనివాసరాజు, అంగర గోపాల కృష్ణ, అందే ఈశ్వరరావు, వీరమల్లు శ్రీనివాసరావు, గూడవల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలను ఆశీర్వదించండి: సూర్యకుమారి

యలమంచిలి, మార్చి 30: ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండే ఎమ్మెల్యే రామానాయుడుకు ఓటుతో మరోసారి ఆశీర్వదించాలని నిమ్మల సూర్యకుమారి అన్నారు. యలమంచిలి గ్రామంలోని తాడిగరువుతోట, మెయిన్‌రోడ్, గొల్లపరచెరువుగట్టు ప్రాంతాల్లో జనసేన, టీడీపీ శ్రేణులతో కలిసి నిమ్మల సూర్యకుమారి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళల అభ్యున్నతే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. బొప్పన హరికిషోర్, చిలుకూరి రాజ్యలక్ష్మీశ్రీనివాస్, తాళ్లూరి బుజ్జిబాబు, కాసా సత్య, కడలి విజయ్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, బొప్పన రాంబాబు పాల్గొన్నారు.

కూటమితోనే తణుకు అభివృద్ధి : ఆరిమిల్లి

తణుకు, మార్చి 30: తణుకు అభివృద్ధి కూటమితోనే సాధ్యమని తణుకు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం వేల్పూరు రోడ్డులోని ఆంధ్రామగర్స్ ఎదురుగా ఉన్న పార్కులో వాకర్సుతో మాట్లాడారు. పట్టణంలో మౌళిక సదుపాయాలు కల్పించామని, స్పోర్ట్సు యాక్టివిటీని పెంచామని, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కోసం క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం పట్టణాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. ఇరగవరం మండల జనసేన శ్రేణులు ఆరిమిల్లిని కలసి కూటమి అధికారంలోకి రావడానికి కలసి పనిచేస్తామని చెప్పారు. పట్టణంలోని ఫ్లోర్ మిల్స్ సంఘ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. వేల్పూరుకు చెందిన పలువురు బీసీ యువకులు ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరారు.

జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుదాం: నాయకర్

మొగల్తూరు, మార్చి 30: అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుదామని నరసాపురం జనసేన అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. శనివారం పేరుపాలెం సౌత్ గ్రామంలో ఆయన జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా, రాజధాని లేకుండా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లాటి గోపి, వలవల నాని, బందెల రవీంద్ర, గుబ్బల మార్రాజు, వాతాడి కనకరాజు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పిట్టావారి తోటకు చెందిన ఎస్సీ సోదరులు శనివారం బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. పిట్టా సునీల్, కొల్లాబత్తుల యాకోబు, నాగాబత్తుల రామ్, జాన్ వెస్లీ, రత్నంరాజు, రాజీవ్ తదితర 80 మంది గ్రామస్థులు జనసేన పార్టీలో చేరారు.

బొలిశెట్టి గెలుపుతో అవినీతి అంతం: వలవల

పెంటపాడు, మార్చి 30: నియోజకవర్గంలో అవినీతి పాలన అంతమొందించాలంటే కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శనివారం పెంటపాడులో నిర్వహించిన పల్లెపోరులో ఆయన మాట్లాడుతూ వైసీపీలో ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ వేల కోట్ల ప్రజాధనం లూటీ చేస్తే తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణ వందల కోట్లు దోచేశారన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దాసరి అప్పన్న, బండి పెద్దిరాజు, గంధం సతీష్ పాల్గొన్నారు.

రన్‌ఫర్ జీసస్ ర్యాలీ



నరసాపురంలో క్రైస్తవుల ర్యాలీ

నరసాపురం టౌన్, మార్చి 30: పట్టణంలో శనివారం రన్‌ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ సభ్యులు నళిని, జాన్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పట్టణ వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రార్థనలు, గీతాలను ఆలపిస్తూ ర్యాలీ ముందుకు సాగింది. ఆదివారం జరిగే ఈస్టర్ విశిష్టతను పాస్టర్లు వివరించారు.

ఆకివీడు: క్రీస్తు పునరుత్థానాన్ని గుర్తు చేసేందుకే రన్ ఫర్ జీసస్ అని బిషప్ ప్రసాద్‌రాజు అన్నారు. ప్రేమ, శాంతి, కరుణను చూపుతూ ఏసుక్రీస్తు అడుగుజాడల్లో నడవాల్సి ఆవశ్యకత ఉందన్నారు. వందలాది మంది క్రైస్తవులతో శనివారం ర్యాలీ నిర్వహించారు.

యువత టీడీపీకి ఓటు వేయాలి



పోడూరు, మార్చి 30: పోడూరు పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా ఓటు హక్కు పొందిన యువతకు శనివారం జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే నాయకుడు చంద్రబాబు అని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు బాగుంటాయన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, అందువలన మొదటి ఓటు చంద్రబాబు కి వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మహిళా కమిటీ కార్యదర్శి తాయారు, బండి స్వర్ణలత, సుంకర రాజకుమారి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



భీమవరం, మార్చి 30: భీమవరం పోస్టల్ శాఖ ప్రధాన కార్యాలయంలో మెయిల్ ఓవర్సీగా విధులు నిర్వహిస్తున్న తోట సత్యనారాయణ ఉద్యోగ విరమణ సత్కార కార్యక్రమం శనివారం హెడ్‌పోస్టాఫీస్ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోస్టల్ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎ.సురేష్ కుమార్, ఐపీఓ బాలసుబ్రహ్మణ్యం, పోస్టుమాస్టర్ ఎల్. సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. సత్యనారాయణ దంపతులను సత్కరించారు.

ఎన్నికలకు రక్షణ చర్యలు తీసుకున్నాం



మాట్లాడుతున్న ఎస్ఐ నాళం శ్రీనివాసరావు

పాలకోడేరు, మార్చి 30 : ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోనేలా అన్ని రక్షణ చర్యలు చేపడుతున్నామని ప్రజలు ఎవ్వరూ కూడా అభద్రతా భావంతో ఉండవల్సిన అవసరం లేదని పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు అన్నారు. కోరుకొల్లు గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈవోపీఆర్డీ ఆంజనేయులు, ఏఎస్ఐ మోహనరావు, ఆర్ఐ నాగభూషణరావు పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌పై నైపుణ్యం పెంచుకోవాలి

గణపవరం, మార్చి 30: కళాశాల విద్యార్థులకు అవసరమైన ఆంగ్ల నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని తద్వారా అవకాశాలను పెంచుకోవాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఆంగ్ల అధ్యాపకుడు కేఎస్.రత్న కుమార్ సూచించారు. శనివారం గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ఆంగ్ల బోధనపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. రత్నకుమార్ మాట్లాడుతూ ఇంగ్లీష్‌లో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ నేడు ఇంగ్లీష్ అత్యంత అవసరమని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు.



మహిళా మోర్చ కమిటీ సభ్యులతో బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా నాయకులు

జిల్లా మహిళా మోర్చ కమిటీ ఎన్నిక

భీమవరం టౌన్, మార్చి 30 : భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా కమిటీని శనివారంనాడు పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లాఅధ్యక్షురాలు అల్లూరి పద్మ వర్మ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కె డి కిర్మణయి(తణుకు), నడింపల్లి లీలా(భీమవరం), ఉప్పలపాటి శ్రీదేవి(ఆచంట), పడాల కావ్యరెడ్డి(టిపిగూడెం), అలుగు ప్రమీలా(భీమవరం), చల్లా కృష్ణతులసీ(ఆచంట), జనరల్ సెక్రటరీలుగా ఎం శిరీషా కుమారి(నరసాపురం), వై వెంకట లక్ష్మి(టిపిగూడెం), కార్యదర్శులుగా కుచ్చర్లపాటి భారతీ(పోడూరు), పి శ్యామలగౌరీ(పాలకొల్లు), బి నీలిమాకృష్ణ(పాలకోడేరు), గన్నాబత్తుల సత్యవతి(నరసాపురం), కోశాధికారిగా ఎం మమతా అనురాధలను ఎంపికచేసామని వీరితోపాటు 5 గురిని ఎగ్జిక్యూటివ్ సభ్యురాలుగా నియమించామన్నారు. ఎంపికైన కమిటీ సభ్యులను నరసాపురం పార్లమెంట్ సభ్యుడు భూపతిరాజు శ్రీనివాసవర్మ, క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ పాకావెంకట సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు నారిన తాతాజీ, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ్ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పార్లమెంట్ కన్వీనర్ సుభాష్ రాజు తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యే గ్రంధికి క్షత్రియ యూత్ మద్దతు

భీమవరం రూరల్, మార్చి 30 : భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంటే తాము నడుస్తామని క్షత్రియ యూత్ వెల్లడించింది. ఈమేరకు శనివారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో క్షత్రియ యూత్ ఆయనను కలిసి సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమవరం పట్టణాన్ని కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్షత్రియ యూత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ జేఏసీ కన్వీనర్ ఏఎస్‌రాజు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, అభిరుచి రఘు, తదితరులు పాల్గొన్నారు.

యండగండిలో వాహనాల తనిఖీలు

ఉండి, మార్చి 30: ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనఖీలు నిర్వహిస్తున్నట్లు ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు. శనివారం యండగండి వద్ద తాడేపల్లిగూడెం-భీమవరం ప్రధాన రహదారులలో తనిఖీలు చేశామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువ తీసుకుని వెళ్లకూడదన్నారు. ఒకవేళ అవసరము బట్టి తీసుకుని వెళ్తే దానికి సంబంధించి ఆధారాలు చూపాలన్నారు.

ఎండలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 30: ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పంచాయతీ, ఆరోగ్య కార్యదర్శులకు వడగాల్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల ఆధ్వర్యంలో నాయకుల ఫొటోలు, పేర్లు, పార్టీల పేర్లు లేకుండా పంచాయతీ బోర్డులతో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలను ఎండ తీవ్రంగా ఉండే సమయంలో బయటకు రాకుండా అప్రమత్తం చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తహసీల్దార్ మురళికృష్ణ, మండల పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో పౌరహక్కుల దినోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 30: తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెంలో తహసీల్దార్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో దళిత నాయకులు, స్థానిక ప్రజలకు పౌర హక్కులను వివరించారు. ఎంపీడీవో శర్మ, సహాయ సాంఘిక సంక్షేమాధికారి రామాంజనేయరాజు, ఎస్సీ మోనిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు ఆర్. నాగబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకోవాలి

భీమవరం టౌన్, మార్చి30 :ఓటు విలువ తెలుసుకుని, ఆలోచించి ఓటు హక్కును వినియో గించుకోవాలని ఆర్ఆర్‌డీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ వికేజె ప్రసూన అన్నారు. కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటు విలువ - ఓటు వినియోగం అంశంపై సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడు తూ ఓటు రాజ్యాంగ ప్రకారం లభించిందని, దానిని గౌరవించి నిజాయతీగా ఓటు వేయాలని అన్నారు

నేడు దేశాలమ్మ జాతర

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 30: కుంచనపల్లిలో దేశాలమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శనివారం గరగ నృత్యాలు, ఆసాదుల విన్యాసాల నడుమ అమ్మవారి ఊరేగింపు జరిగింది.

మావుళ్ళమ్మ హుండీ ఆదాయం రూ.40,82,260



భీమవరం టౌన్, మార్చి 30: మావుళ్ళమ్మ అమ్మవారి హుండీ ఆదాయం శనివారం నాడు లెక్కించగా 45 రోజులకిగాను 40లక్షల 82వేల 260 రూపాయలు ఆదాయంగా వచ్చిందని ఆలయ ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్ తెలిపారు. నగదుతోపాటు, బంగారం67గ్రాముల 165 మిల్లి గ్రాములు, వెండి 165 గ్రాములు కానుకలుగా వచ్చాయని తెలిపారు. లెక్కింపులో దేవదాయధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, శక్తీశ్వరస్వామి ఆలయ ఈవో కర్రీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.